

# బురుజువీధి కథలు

## – కె.వి.రమణరావు



(వినగలిగితే భూగోళమ్మీద ప్రతి పదార్థమూ, ప్రతి ప్రదేశమూ కథలు చెబుతాయి. మరి, మా బురుజువీధీ అందుకు మినహాయింపు కాదు. మా బురుజువీధి చెప్పిన, చెబుతున్న కథలు నెలకొకటిగా మీ కోసం...)



# అందానికి కొలమానం

**ఆ రోజు** పొద్దున్నే నేనూ మాఆవిడ కామేశ్వరి పెరట్లో పూలమొక్కలను చూస్తూ కాఫీ తాగుతున్నాము.

"యీ పువ్వులు చూడెంత అందగావున్నాయో" అన్నాను అప్పుడే విచ్చుకున్న గులాబీలను చూపిస్తూ.

"యే పువ్వు అందం దానిదే" అంది కామేశ్వరి లిల్లీలు, కనకాంబరాలవైపు చూస్తూ.

“యేమైనా గులాబీల అందం గొప్పది. అందంలో యెక్కువతక్కువలు లేవంటావా? స్త్రీలలో యెక్కువ అందమైనవాళ్లను గుర్తించకపోతే భావకవులు అన్ని కావ్యాలెలారాస్తారు? అంతెందుకు, మనవీధిలోనే బసవలింగం కోడలు అనితను అందరూ పొగుడుతారుగదా?”

“అందానికి కొలమానం యేముంటుంది, అది చూసేవారి కళ్లనుబట్టివుంటుంది. అందంగా కనపడాలనుకునేవాళ్లు గుర్తింపుకోసం అలంకరణలు చేసుకుంటారు. సహృదయంతో చూస్తే చాలావరకు అందరూ అందంగానే కనబడతారు”

“అందాన్ని కొలవడంకూడా నాగరికతలో భాగమనుకుంటా. లేకపోతే అందాల పోటీలు, సినిమా స్టార్లు కావాలనే తపన, యీ వేలకోట్ల యీ కాస్మెటిక్స్ వ్యాపారాలు, అందంగావున్న వాళ్లకి కట్నాలు తగ్గడం యివన్నీ యెందుకుంటాయి” అన్నాను.

"తెలుపు, నలుపు, పొడవు, పొట్టి అంటూ కొలతలన్నీ అసమానతలతోపాటు మనిషి సృష్టించిన దుర్మార్గమే. అందులో యిరుక్కుపోయి అవస్థ పడుతున్నాం. కొలవడమంటూ మొదలుపెడితే యిక అన్నీ వొకదాని తరువాతొకటి అనర్థాలే" అంది కామేశ్వరి.

సిటీలో చదవడంవల్ల, బాగా చదువుకున్న కుటుంబంలోంచి రావడంవల్ల అప్పుడప్పుడూ ఎవరికీ అర్థంకాకుండా మాట్లాడ్డం ఆమెకు అలవాటే.

“బసవలింగం అంటే గుర్తొచ్చింది. యీ సాయంత్రం వాళ్ల మనమరాలి రెండో పుట్టినరోజు పండగ, చాలాసార్లు పిలిచారు, మనం వెళ్లాలి” అని లేచి రోజువారి పనుల్లో పడ్డాను.

ఆరోజు సాయంత్రం బసవలింగం ఇంట్లోని ఫంక్షనుకి వీధిలోని అన్ని కుటుంబాల్నుంచి పిల్లా పెద్దా వచ్చారు. వాళ్లమేడ బురుజునుంచి మూడోది. బసవలింగం కూతురు టౌన్లో వుంటుంది. ఆమెకు ఆలస్యంగా పుట్టిన పిల్లకాబట్టి ఏర్పాట్లు బారీయెత్తున చేసాడు బసవలింగం. సంబరం ఘనంగా జరిగింది.

ఫంక్షనులో బసవలింగం కోడలు అనిత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అసలే ఎత్తైన తెల్లటి మనిషి. దానికితోడు ఆమె ధరించిన పట్టుచీర, నగలు లేటెస్టు ఫ్యాషన్ వి కావడంతో ఆమె జిగేల్మని మెరిసింది. అటు తండ్రికి ఇటు మామగారికి

నగల వ్యాపారమేవుండడంతో ఇక కొదవేముంది? చాలామంది ఆడవాళ్లు ఆమె అందాన్ని ఆమెయెదుటే మెచ్చుకున్నారు. ఆడవాళ్లల్లో అసూయ ఎక్కువంటారు. మరి ఈ పొగడ్తల్లో 'తిరకాసేమైనావుందా' అని నాక్కొంచెం అనుమానమేసింది.

హాల్లో ఫంక్షను, పెరట్లో విందు పూర్తయ్యేసరికి రాత్రి పదైంది. అతిథులంతా ఇళ్లకు వెళ్లిపోయారు. మా వీధి సంక్షేమసంఘ సభ్యులం మాత్రం మొదటి అంతస్తులోని బాల్కనిలో కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఉండిపోయాం. దూరంగా వీధిచివరున్న నదివైపునుంచి చల్లనిగాలి వీస్తోంది. ఒక పక్షులగుంపు రాత్రి అందాన్ని చూడాలనికాబోలు గూళ్లువిడిచి విహరిస్తున్నాయి.

అందరూవెళ్లాక బసవలింగం వచ్చి మనమరాలి తెలివితేటలగురించి కాసేపు చెప్పాడు. సమయం పదిన్నరదాటి మిగిలినవాళ్లం ఇక వెళ్లిపోదామనుకుంటూండగా కింద హాల్లోంచి పెద్దగా వాదించుకున్నట్టుగా అరుపులు వినబడ్డాయి. ఫంక్షనులో సహాయపడిన మావీధి 'పరోపకారి' పాండురంగ, అతని భార్య సుశీల సర్దిచెప్తున్నారు.

"యిప్పుడే వస్తా, యిక్కడే వుండండి" అని చెప్పి బసవలింగం హడావుడిగా కిందకెళ్లాడు. అతనెళ్లాక అరుపులు ఆగిపోయాయి. కాస్సేపు తరువాత అతను మొహం వేళ్లాడేసుకొని వచ్చి కూర్చున్నాడు.

"యేమైంది?" అనడిగాడు మా సంఘ ఉపాధ్యక్షుడు నారాయణమూర్తి.

బసవలింగం నిట్టూర్చి "మా కోడలు అనితతో సమస్యగా వుంది. యేదోవొకరోజు మీతో మాట్లాడి మీ సలహా తీసుకుందామనే అనుకుంటున్నాను" అన్నాడు

"అనిత అందర్తో బాగానే వుంటుందిగా, యెలాంటి సమస్య?" అడిగాడు స్వామినాయుడు.

నిజానికి అనిత అందరితో చక్కగా కల్చర్డ్ గా మాట్లాడుతుంది. ఆమె నాన్న శంకరయ్యకు విజయవాడలో బంగారునగల షాపుంది. అక్కడి మాఆఫీసులోని నా స్నేహితుడిద్వారా మాయిద్దరికీ పరిచయం. ఆయన నెమ్మదస్తుడు. కూతుర్ని చూడ్డానికి మావూరొచ్చిన ప్రతిసారీ మాయింటికొచ్చి కాసేపు మాట్లాడి వెళ్తుంటాడు. ఆయన వ్యాపారం సజావుగా సాగడంలేదని ఆయనే ఒకట్రెండుసార్లు చెప్పాడు.

"మాతోకూడా బాగానే వుంటుందిగాని వొకవిషయంలోనే పట్టుబడుతోంది. యిప్పుడు అర్జెంటుగా హైద్రాబాదులో మాషాపు బ్రాంచి పెట్టాలంటుంది. తనూ మావాడు నరేషూ వెళ్లి కొన్నాళ్లు అక్కడ వేరు కాపురం పెడతారంట" అన్నాడు బసవలింగం నిస్పృహగా.

"అలా యెందుకు? మీకున్నది వొక్కడే కొడుకు, యిక్కడ వ్యాపారం వృద్ధిలో వుంది. యిప్పుడిప్పుడే అతనూ కుదురుకుంటున్నాడు. యెక్కడో తెలియని చోట బ్రాంచి పెడితే అక్కడ నెట్టుకురావద్దూ?" అన్నాడు మునిరెడ్డి.

"యివన్నీ చెప్పిచూసాం, వినడంలేదు. అలాగైతేనే మవాడికి సరైన అనుభవం వస్తుందని వాదిస్తోంది. మావాడు యెటూచెప్పడంలేదు. మీ సలహా చెప్పండి" తలపట్టుకున్నాడు బసవలింగం.

"కోడలన్నాక యింట్లో పెద్దవాళ్లమాట వినడం ధర్మం. వేరుకాపురాలు మన సంస్కృతికి విరుద్ధం. మీరు గట్టిగా వుండండి అన్నీ సర్దుకుంటాయి" అన్నాడు రంగశాయి.

"మీవాడికి యింకా పూర్తిమెళుకువలు రాలేదు. హైద్రాబాదులాంటి సిటీలో అంటే ప్రమాదం" భయపెట్టాడు ధనరాజ్.

"యీతరం ఆడపిల్లలు కుర్రతనంతో వుమ్మడికుటుంబాల్లో వుండడానికి యిష్ట పడడంలేదు, అనిత నాన్నతో మట్లాడి వాళ్లతో చెప్పించండి" సూచించింది సుగుణమ్మ.

"అసలు అనితతో వోపిగ్గా మాట్లాడి ఆమె యెందుకట్లా అడుగుతోందో తెలుసుకోండి" అని సలహా యిచ్చాడు చలపతి. ఎప్పటిలాగానే అతని సలహా ఎవరికీ నచ్చలేదు.

"ఆమెనడిగితే యేంచెప్తుంది పాపం? ఆపిల్లకున్న వేరుకాపురం సరదా తెలుస్తూనేవుందిగదా! సినిమాల ప్రభావం" అన్నాడు స్వామినాయుడు.

"మన మూలధర్మం ప్రకారం స్త్రీపురుషులిద్దరూ సమానమే, ఆమెతో మాట్లాడ్డం సమంజసమే" నిదానంగా చెప్పాడు కాశీనాథ్. అతని మాటలెవరూ పట్టించుకోలేదు.

నాకేంమాట్లాడాలో తెలియలేదు, మౌనంగా వుండిపోయాను.

"నీ కొడుకు నరేషుతో విడిగా మాట్లాడి వేరేకారణమేమైనా వుందేమో తెలుసుకో. తరువాత మాట్లాడదాం" అన్నాడు మూర్తి సమావేశాన్ని ముగించి లేస్తూ. మేమూ లేచాము.

"ఇందులో అంతుబట్టనిదేదో వుంది, బసవలింగం అసలువిషయమేదో దాస్తున్నా డు" అన్నాను మాయెదురింటి చలపతితో బయటికొచ్చాక. అతను ఔనన్నట్టు తలవూపాడు .

రాత్రి జరిగిందంతా పొద్దున్నే మా ఆవిడతో చెప్పాను.

"యెవరి కోరికలు వాళ్లకుంటాయి. అందరూ నాలాగ గృహిణిగా వుండిపోవాలనుకుంటారా" అంది కామేశ్వరి పెదవి విరిచి.

"ప్రశాంతంగా యీవూర్లోనే వుండిపోవాలన్నది నీ నిర్ణయమేగా" అన్నాను

"అదేలే నేను చెప్తున్నదీ. అనితకు అలావుండాలని లేదుగా, కొందరికి గొప్పస్థాయికి వెళ్లాలని వుండడం తప్పుకాదుగా"

"అనిత అందమైందన్న మాట నిజమే, కానీ అదితప్ప యింకేముందీ? నగల వ్యాపారంలో నష్టపోయి అప్పులున్న కుటుంబం నుంచి వచ్చింది. యేపనిలోనూ అనుభవంలేదు. చదువూ అంతంతమాత్రమే. నరేషు వొక ఫంక్షన్లో

అనితను చూసి, ఆమె అందానికి పడిపోయి, ఆమెనే చేసుకుంటానని మొండికేసాడు. బసవలింగానికి యిష్టంలేకపోయినా సౌమ్యుడు కాబట్టి వొపుకున్నాడు"

"తనకే తెలియని ప్రతిభేదైనా వుందని అనితకు నమ్మకముందేమో. యేవుద్దేశ్యంతో పొగిడినా, ఆమెని నిన్న పొగిడినవాళ్లంతా దాన్ని బలపరిచినట్టే. అది పరీక్షకు నిలబడితేగాని తెలియదుగదా?"

"నరేషు ఆమెచెప్పినట్టల్లా వింటాడా? యీమధ్య అతన్నికూడా లెక్కజెయ్యడంలేదట, కాపురం చెడగొట్టుకుంటోందని మా బంగార్రాజు చెప్పాడు"

"అవన్నీ వొకే అంశానికి చెందిన లక్షణాలు" అని నవ్వి వంటింట్లోకి వెళ్లింది కామేశ్వరి.

నెలరోజులు పోయాక కామేశ్వరి హఠాత్తుగా ఒక వార్త చెప్పింది. బసవలింగం కోడలు అనిత 'భర్త, అత్తమామలమీద అలిగి పుట్టింటికి వెళ్లిపోయిందని, ఆవార్త నిజమేనని, మావీధి 'వార్తల వనజమ్మ' కల్పన కాదని'.

"అవతలి మనిషి చెప్తున్నదేంటో వినిపించుకొని కాస్త అనునయంగా మాట్లాడివుంటే అన్నీ సర్దుకునేవి. మీ సంఘంపెద్దల మాటవిని బసవలింగమన్నయ్య కఠినంగా వున్నార్ట. యిదీ పర్యవసానం" అంది కామేశ్వరి కొసరుగా.

"బసవలింగం తన కోడల్ని అనునయించలేదని నువ్వెందుకనుకుంటున్నావు? యిక మా సంఘపెద్దలమీద నీ అసహనం వుండనేవుంది" అన్నాను

"యెదుటివారిని అర్ధంచేసుకుని అనునయించడం వేరు, నీతివాక్యాలు చెప్పడం వేరు. కొన్ని ఆలోచనలు అణగదొక్కేకొద్దీ పెరుగుతాయి. యెవరికి వాళ్లను తెలుసుకోనివ్వడం వుత్తమం" అంది వంటింట్లో కెళ్తూ కామేశ్వరి.

'యేమిటో యేదీ సరిగ్గా చెప్పదు' అనుకుంటూ నేను నా పనిలో పడిపోయాను.

సరిగ్గా ఒక వారం తర్వాత ఒకరోజు రాత్రి పొద్దుపోయాక బసవలింగం, అతని కొడుకు నరేషు మాయింటికొచ్చారు. కామేశ్వరి అప్పటికే నిద్రపోయింది. లేపబోతే బసవలింగం వారించాడు. ముందుగదిలో కూర్చోబెట్టి నేనే పాలు వేడిచేసి యిచ్చాను.

"యేంజరిగిందో నీకు తెలిసేవుంటుంది సూర్యం! వీధిలోనేగాక, వూర్లో తెలిసినవాళ్ల దగ్గర తలెత్తుకోలేకుండావున్నాము" అన్నాడు బసవలింగం, పాలు తాగాక.

నేను తలాడించాను.

"నీకు తెల్సుగదా వాళ్లది విజయవాడ. అనిత వాళ్లనాన్న శంకరయ్యతో నీకొక్కడికే పరిచయం. యిక్కడికొచ్చినప్పుడంతా మీయింటికొస్తూండేవాడు" అని ఆగాడు బసవలింగం.

ఆయన నాకు మధ్యవర్తిత్వం పని అప్పగించబోతున్నాడని బోధపడింది.

"రేపు శంకరయ్యతో మాట్లాడమంటావా" అనడిగాను.

"ఫోన్లతో కాదు, నువ్వు యీఆదివారం విజయవాడ వెళ్లి వ్యక్తిగతంగా మాట్లాడితేనే పనౌతుంది. అనితకూడా అక్కడేవుంది. యెలాగైనా యిక్కడికి రావడానికి వొప్పించాలి. యేమవసరమైనా మాతో అక్కడినుంచే ఫోన్లో మాట్లాడచ్చు" అన్నాడు.

"ఆదివారం కాదుగాని, బుధవారం నాకు విజయవాడవెళ్లే పనుంది. ఆరోజు సాయంత్రమే వెళ్లి మాట్లాడ్తాను, అవసరమైతే గురువారం వుంటాను" అని సూచించాను.

"అట్లాగే చేద్దాం. నువ్వెట్లాగైనా అమ్మాయికి నచ్చజెప్పాలి. హైద్రాబాదులో యింకో షాపు పెట్టలేకకాదు, యెట్లా చూసినా అది సరైనపని కాదు" అన్నాడు బసవలింగం లేస్తూ.

ఇద్దరూ మెట్లు దిగుతుండగా అంతసేపూ యేమీ మాట్లాడని నరేషు నావైపు చూసి "గురువారముండేట్టుగా వెళ్లండి, తీరిగ్గా మాట్లాడచ్చు" అన్నాడు.

పైకి చెప్పలేని విషయమేదో అతని మొహంలో కదలాడినట్టనిపించింది. నాకు సరిగ్గా అర్థంకాలేదుగాని కామేశ్వరి ఐతే ఇలాంటివి పసిగట్టడంలో దిట్ట.

మంగళవారం రాత్రి విజయవాడ బయలుదేరేప్పుడు "అనిత చెప్పేది కాస్త వోపిగ్గా వినండి. ఆమెకొక అవకాశమివ్వడం న్యాయం" అంది కామేశ్వరి.

నేను బుధవారం పగలు నా ఆఫీసుపని చూసుకుని ముందుగా ఫోన్ చేసి సాయంత్రానికి శంకరయ్య ఇంటికెళ్లాను. శంకరయ్య చుట్టమైన నాస్నేహితుడు ఊళ్లో లేకపోవడంవల్ల నేనొక్కణ్ణే వెళ్లాను. నన్నుచూడగానే అతని మొహంలో సంతోషం కనబడింది. అనిత నిర్లిప్తంగా ఉంది. రాత్రి అక్కడే భోజనంచేశాక శంకరయ్యా నేనూ మాట్లాడుతూ వీధిలో నడిచాం.

శంకరయ్య తన వ్యాపారాన్ని పెద్దల్లుడికప్పజెప్పి కొట్టువెనక నగల తయారీలోనే కాలం గడుపుతున్నాట్ట. అప్పులుకూడా కొంతవరకు తీర్చేసార్ట.

"మనసు చంపుకోలేని మెత్తటి మనుషులు వ్యాపారానికి పనికిరారు సూర్యంబాబూ, మా పెద్దల్లుడు గట్టోడు" అన్నాడు శంకరయ్య.

"ఐతే యిప్పుడు ప్రశాంతంగా వున్నారన్న మాట" అన్నాను

"అలాగే అనుకున్నాము, కానీ పాపకర్మ యింకా మిగిలేవున్నట్టుంది. పిచ్చికోరికలతో చక్కగావున్న కుటుంబంమీద అలిగి అనిత యిక్కడికొచ్చేసిందిగదా" అన్నాడు విచారంగా.

'నేనావిషయం మాట్లాడ్డానికే వచ్చా' అని బసవలింగం, నరేషు మాయింటికొచ్చి మాట్లాడిన విషయం చెప్పాను.

"అదే అనుకున్నాను. కానీ సమస్యే మనిషిగా మారితే యింక పరిష్కారమెట్లా వొస్తుంది అది అందంగా పుట్టడమే దాని సమస్య" అన్నాడు

"అదొక గొప్ప అదృష్టం, సమస్యెలా అవుతుంది? సరిగ్గా చెప్పండి"

"చిన్నప్పట్నుంచి ప్రతిమనిషీ తెలిసో తెలియకో దాన్ని అందంగావున్నావని పొగిడి పొగిడి తను గొప్పదాన్నని, ప్రత్యేకమైన మనిషినని దాని బుర్రలో స్థిరపడిపోయింది"

"ఆవిషయం నిజమేగదా? దానివల్ల వొచ్చిన నష్టమేముంది"

"దానికి తన అందంగురించి తప్ప మరే విషయంమీదా శ్రద్ధ లేకుండా పోయింది. చదువు చట్టుబండలైంది. చుట్టూ అలాంటి పొగిడేవాళ్లనే పెట్టుకుంది. తనో గొప్ప సినిమా స్టారు కాగలదని వాళ్లంతా లేని కోరికల్ని పుట్టించారు. సినిమాలు చూడ్డమే లోకమైంది. అది చాలక యిక్కడేదో అందాలపోటీలో పాల్గొనేట్టు ప్రోత్సహించారు, వాళ్లదేంపోయింది? మా దురదృష్టంకొద్దీ దానికి బహుమతికూడా వచ్చింది"

"పొగడ్తలేకాదు, అద్దంకూడా నిజం చెప్తుందిగదా! ఐతే ఆ ప్రభావంలో పడకుండా, దాన్ని అవగాహన చేసుకుని, సరిగ్గా వినియోగించుకుంటే జీవితం చక్కగా వుంటుందంటారు. కానీ బాగా చదువుకున్నవాళ్లుకూడా దీన్నుంచి తప్పించుకోలేక పోతున్నారు. యిది ఆడవాళ్లకు నాగరికత యిచ్చిన వరమా, శాపమా అన్నది చెప్పలేం. పైగా 'అలాంటి గిఫ్టెడ్ మనుషులు పెళ్లి, సంసారంలాంటి మామూలు విషయాలకు అతీతమని' కవులుగట్రా సిద్ధాంతీకరించారు"

"అందుకే ఆయనెవరో గ్రీసు తత్వవేత్త 'ప్లేటో' అనే ఆయన 'కవులను రాజ్యంనుంచి బహిష్కరించాలని' చెప్పాడని నా స్నేహితుడు యింగ్లీషు మేస్టారు చెప్పాడు. అలాంటి కవిత్వాలు తలకెక్కి అనిత పెళ్లేవద్దంది. డిగ్రీ ఫెయిలయ్యాక హైద్రాబాదెళ్లి సినిమా ప్రయత్నాలు చేస్తానని మొండిపట్టు పట్టింది. అసలే అప్పుల్లోవున్న మేము 'శంకరయ్య కూతురిచేత యిలాంటి పనిచేయిస్తాడా' అని లోకులంటారని భయపడి సుతారామూ వొప్పుకోలేదు. పెళ్లి చేద్దామని ప్రయత్నిస్తే యేదీ కుదర్లేదు, తనే తిరగ్గొట్టిందని మా అనుమానం"

"మరి నరేషుతో పెళ్లికొప్పుకునే చేసుకుందిగా"

"అక్కడే చిక్కొచ్చిపడింది. పెళ్లైన యాడాది తర్వాత అనితను హైద్రాబాదు తీసుకెళ్లి సినిమా ప్రయత్నాలు చేస్తానని పెళ్లికిముందు నరేషు మాటయిచ్చాట్ట. అలా యిచ్చాకే పెళ్లికి వొప్పుకుందట. యీవిషయం వాళ్లు మాకెవ్వరికీ చెప్పలేదు. అదీ గొడవ. అతన్ని మేమడిగితే 'పెళ్లయ్యాక తన ఆలోచన మార్చుకుంటుందని అనుకున్నా'నని చెప్పాడు. అది కేవలం ఆలోచన కాదు ఆమె నరాల్లో ఇంకిపోయిన కోరిక అని అతనికి తెలీదు. ఆమె యీ బలహీనతను గమనించి యేవెధవైనా మాకు తెలియకుండా ఆశపెట్టి ఆమెను హైద్రాబాదుకో, బొంబాయికో తీసుకెళ్లిపోతాడేమోనని హడలి చస్తున్నాం" అన్నాడు శంకరయ్య, చాలాసేపు మాట్లాడుతూ నడవడంవల్ల కొంచెం ఆయాసపడుతూ.

“అనిత అంతపని చేస్తుందనుకోను, అది మీ తల్లిదండ్రుల అతిభయం. సినిమా ప్రయత్నాలకని కాకుండా వ్యాపారంకోసం హైద్రాబాదు వెళ్తున్నట్టుగా చెప్పమంటోంది గమనించండి. ఆమెకూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలుసు. రేపు మళ్లీ వస్తాను, అనితను కూర్చోబెట్టి మాట్లాడదాం. సమస్యను ఆమె మాత్రమే పరిష్కరించ గలదు" అని అప్పటికే రాత్రి పొద్దుబోవడంతో నేను సెలవు తీసుకున్నాను.

మరుసటిరోజు పొద్దునే కామేశ్వరితో జరిగిందంతా ఫోన్లో చెప్పాను. తను కొన్ని సూచనలిచ్చింది. నరేషుతో, బసవలింగంతో మాట్లాడాను. ఉదయం పదకొండుగంటలకు శంకరయ్య యింటికి వెళ్లాను.

శంకరయ్య, ఆయన శ్రీమతి, నేను, అనిత కూర్చున్నాము. శంకరయ్య ముందు రోజు చెప్పిన విషయమంతా నిజమేనని అనిత ఒప్పుకుంది. తను ఏమాలోచిస్తున్నదో తనకు తెలుసని, హైదరాబాదెళ్లి సినిమాల్లో ఒక ప్రయత్నం చేయాలనుకోవడం తప్పుకాదని, తన నిర్ణయంలో మార్పులేదనీ చెప్పింది. అక్కడ తన స్నేహితురాళ్లున్నారని, ఎవరూ ఒప్పుకోకపోతే తనొక్కతే వెళ్తానంది.

నేను బయటికి వెళ్లి మళ్లీ ఒకసారి నరేషుతో బసవలింగంతో ఫోనులో మాట్లాడి వచ్చాను. ఆ తరువాత ఒక అరగంటలో ఒక అంగీకారం కుదిరింది. నరేషు, అనిత రెండేళ్లపాటు హైద్రాబాదులో ఉంటారు. ఐతే వాళ్లషాపు కొత్తబ్రాంచి తెరవడం కాకుండా, తెలిసిన వాళ్ల షాపులో నరేషు కొత్తమెళుకువలు నేర్చుకోవడానికి ఉద్యోగంలో చేర్తాడు. ఈ రెండేళ్లూ అనిత తన స్నేహితురాళ్ల సహాయంతో సినిమా ప్రయత్నాలు చేస్తుంది. ఆమె చెప్పుకోదగ్గ విజయం సాధిస్తే తరువాత ఏంచెయ్యాలన్నది అప్పుడు ఆలోచిస్తారు. అలాకాకపోతే చక్కగా మా బురుజువీధికి తిరిగొచ్చేస్తారు.

ఈ పరిష్కారం అందరికీ నచ్చింది. నిజానికి చాలావరకూ ఇది అనిత చూపించిన పరిష్కారమే. నిజానికి నేను శంకరయ్యను ఒప్పించడానికే ఎక్కువగా కష్టపడాల్సివచ్చింది.

ఆమెకు అటూఇటూకాక ఇంకాకొన్నాళ్లు అక్కడే వుందామంటే మధ్యవర్తిత్వం చేసిన నేను ఇరుకున పడతానని నా భయం. నాకు అలాంటి ఇబ్బంది రాదని కామేశ్వరి నమ్మకం.

ఆరోజు రాత్రికే బయలుదేరి నేను తిరిగొచ్చేసాను. బసవలింగంకూడా అంత సంతృప్తిగా లేడని తెలుసు, కాని అతనికీ వేరేదారి లేదు. నేనొచ్చిన వారానికి అనిత అత్తగారింటికి తిరిగొచ్చింది. మరో నెలలోపలే నగేషు, అనిత హైద్రాబాదులో కాపురం పెట్టారు.

వాళ్లు వెళ్లిపోయాక మేమీవిషయం మర్చిపోయి మాపనుల్లో పడిపోయాము.

దాదాపు ఆరునెల్లతరువాత ఒకరోజు సాయంత్రం పెరట్లో కూర్చొని పూల అందాన్ని చూస్తూండగా మళ్లీ అనిత ప్రసక్తి వచ్చింది.

"అనితగురించేమైనా తెలిసిందా? నువ్వు చాలా ధైర్యంగా సలహాలిచ్చావుగాని, నాకే యిదెలా ముగుస్తుందోనని భయంగావుంది" అన్నాను.

"మనిషి ఆశకు అంతుండదు. కొందరు అందాన్ని వ్యాపార ముడివస్తువుగా చూసే పరిస్థితి అప్పుడప్పుడూ వస్తూవుంటుంది. అందానికి కొలతలు మొదలయ్యాయంటే ఆ పరిస్థితి వచ్చిందని అర్థం. వ్యాపారానికి లెక్కలే ముఖ్యం. తమలో కళవుందని, దాన్నే పరిగణనలోకి తీసుకుంటారని నమ్ముతున్న అనితలాంటి అమాయకులకు కళకు, వ్యాపారనికి తేడా స్వానుభవంమీదగాని తెలియదు. ఐతే తను ఇక్కడెంత మొండిదో అక్కడకూడా అంత గట్టిదే. నాకు తెలిసిన సమాచారం ప్రకారం యిప్పటికే ఆమెకు తత్వం బోధపడేంత అనుభవమైంది. యిక ఆమె నిర్ణయం తీసుకోవడమే తరువాయి అనుకుంటాను" అంది కామేశ్వరి.

మా ఈ సంభాషణ జరిగిన నెలన్నరకు కాబోలు పొద్దున్నే నేను, చలపతి నదివొడ్డున ఉదయపునడకకు వెళ్లి తిరిగొస్తున్నాము. పొద్దున్నే గుడికెళ్లేవాళ్లు, ఇళ్లలో పాల ప్యాకెట్లు వేసేవాళ్లు బిజీగా తిరుగుతున్నారు. వీధికి రెండువైపులా వున్న చెట్లకింద వీధికుక్కలు అప్పుడే బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటున్నాయి. కొన్నియిళ్లముందు శుభ్రం చేసి నీళ్లుజల్లి ముగ్గులేస్తున్నారు.

మేం చూస్తూండగానే దూరంగా బురుజు, కచేరిసత్రాల మధ్యనుంచి ఒక కారు, మరో మినీలారి వీధిలోకి తిరిగి బసవలింగం ఇంటిముందు ఆగాయి. కార్లోంచి అనిత, నరేషు దిగి సూట్కేసులతో లోపలికెళ్లారు. మినీలారి డ్రైవరు, మరో ఇద్దరు మనుషులు వెనక్కెళ్లి లారీలోంచి ఇంటిసామాను దించడం మొదలెట్టారు.

నేనింటికెళ్లేసరికి కామేశ్వరి వాకిట్లో నిలబడి మినీలారివంకే చూస్తోంది.

"నువ్వు వూహించినట్టే జరిగింది" అన్నా రిలీఫ్ గా నిట్టూరుస్తూ.

"ఆత్మానుభవం ఐతేగాని తత్వం బోధపడదన్నాడు అప్పారావు పితామహుడు. కొన్నిట్లో అది జరక్కుండా మనం మొండిగా అడ్డుపడినంతకాలం సమస్య కొనసాగుతూనే ఉంటుంది" అంది కామేశ్వరి నవ్వుతూ.

(మా బురుజ వీధి చెప్పిన మరోకథ వచ్చేనెలలో)

Post your comments